
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
గురువారం 13 మార్చి 2025



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:21 గురువారం
సహర్ 5:09 శుక్రవారం

ఫటాఫట్

యాసంగి సాగుకు విద్యుత్ సమస్యలు లేవు..

- నిరంతరంగా 18 గంటల వరకు విద్యుత్ సరఫరా
- జిల్లాలో రూ.18 కోట్లకు పెరిగిన డిమాండ్
- స్థలాల కొరతతో సబ్‌స్టేషన్ల ఏర్పాటులో జాప్యం
- సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు పైలట్ ప్రాజెక్ట్..
- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో యాసంగి సాగులో గుంట పంట కూడా ఎండిపోకుండా విద్యుత్ సరఫరా చేస్తు న్నాం. యాసంగి సాగుకు విద్యుత్‌సమస్యలు లేకుండా సిబ్బంది పనిచేస్తున్నారు. స్థలాల కొరతతో 132 కేవీ సబ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయలేకపోతు న్నాం. సెస్ విద్యుత్ డిమాండ్ ను రూ.11 కోట్ల నుంచి రూ.18 కోట్లకు పెంచామని సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి : యాసంగి సాగుకు విద్యుత్ సమస్యలు ఉన్నాయా?

సెస్ చైర్మన్ : యాసంగి సాగుకు ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నాం. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 78 వేల 613 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ వల్ల ఒక గుంట కూడా పంట ఎండిపోకుండా చూస్తున్నాం. ప్రతిరోజు నిరంతరం 17నుంచి 18గంటలు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఇతర కేటగిరీలకు 24గంటల సరఫరా అందిస్తున్నాం. సెస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉన్నారు. ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే పది గంటల్లోనే మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : కొత్త సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా?

సెస్ చైర్మన్ : జిల్లాలో 132 కేవీ అరు సబ్ స్టేషన్లు, 33 /11 కేవీ 76 సబ్‌స్టేషన్లు, 11 కేవీ ఫీడర్స్ 279, వ్యవసాయానికి సంబంధించి 177 ఫీడర్‌లు 11 కేవీ ఉన్నాయి. మిక్స్‌డ్ 11 కేవీ ఫీడర్‌లు 102 ఉన్నాయి. జిల్లాలో కొత్తగా 33/11 సబ్‌స్టేషన్‌లు సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, సుభాష్‌నగర్‌కు మంజూరైనా స్థలాల కొరతతో ఇబ్బంది ఏర్పడింది. 132 కేవీ సబ్ స్టేషన్లు రామన్నపల్లె, మద్దిమల్ల, రుద్రవరం, మాన్వాడలో ఏర్పాటుకు స్థలాల సమస్య ఉంది.

ఆంధ్రజ్యోతి : సెస్ పురోగతి ఏలా ఉంది?

సెస్ చైర్మన్ : సెస్ పురోగతిలోనే ముందుకు సాగుతోంది. ప్రణాళికా బద్ధంగా విద్యుత్ సరఫరాకు సంబంధించిన లోపాలను సవరించడంతో ప్రతినెలా రూ.11 కోట్ల నుంచి రూ.18కోట్లకు పెరిగింది. రాబోయే రోజుల్లో రూ.30 కోట్లకు పెంచాలని భావిస్తున్నాం. దీనివల్ల సంస్థకు నెలకు రూ.5 కోట్లు లాభం చేకూరుతుంది. ప్రభుత్వపరంగా రూ.435 కోట్లు సర్‌ఛార్జ్ లేకుండానే బకాయిలు రావాల్సి ఉంది. వినియోగదారుల నుంచి రూ.162 కోట్ల బకాయిలు ఉన్నాయి. సెస్ కూడా ఎన్‌పీడీసీఎల్, ఇతర చెల్లింపులు రూ.415 కోట్ల వరకు ఉన్నాయి. పాలకవర్గం సమన్వయంతో సెస్ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాం.

ఆంధ్రజ్యోతి : సోలార్ విద్యుత్ ప్రణాళిక ఉందా?

సెస్ చైర్మన్ : సిరిసిల్ల సహహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ విద్యుత్‌ను అందించే విధంగా పైలట్ ప్రాజెక్ట్‌గా చేపడుతున్నాం. ఈనెల 20న జర్మనీ సంస్థ బృందం జిల్లాకు పరిశీలనకు రానుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలతో కలిసి సెస్‌లో సోలార్ ప్రాజెక్ట్‌ను చేపట్టబోతున్నాం.

నిబంధనలు గాలికి..

జిల్లా కేంద్రంలో రోడ్డును వాడుకుంటున్న ఓ ఫంక్షన్‌హాల్





- ఇష్టారాజ్యంగా ఫంక్షన్‌హాళ్ల ధరలు
- సర్వీస్ ట్యాక్స్‌ల ఎగనామం..?
- ప్రభుత్వ నిబంధనలు తుంగలో..
- మున్సిపల్ రోడ్లే పార్కింగ్ ప్రదేశాలు
- జిల్లా కేంద్రంలో 25 ఫంక్షన్‌హాళ్లు
- ఏడు ఫంక్షన్‌హాళ్లకే ట్రేడ్ లైసెన్స్‌లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రభుత్వ నిబంధనలు తమకేం పట్టనట్లుగా ఫంక్షన్ హాల్‌ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా ఉంటున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 25 వరకు ఫంక్షన్‌హాళ్లు ఉన్నా.. వాటికి సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ వంటి అనుమతులు ఏడు హాళ్లకు మించి లేవని తెలుస్తోంది. మున్సిపల్ అధికారులు ట్రేడ్ లైసెన్స్‌ల కోసం ప్రచారం చేస్తున్నా ఫంక్షన్‌హాళ్ల యజమానులు పట్టించుకోవడం లేదు. కొన్ని ఫంక్షన్‌హాళ్లు కుల సంఘాల ఆధ్వర్యంలో ఉన్నాయి. కిరాయిలకు ఇస్తూ వ్యాపారాలు సాగిస్తున్నా సంఘాలు కూడా తమకు వర్తించదు అన్నట్లుగా ఉన్నాయి. మరికొన్ని ఫంక్షన్ హాళ్లు పూర్తిగా కమర్షియల్ తరహాలోనే అధిక ధరలతో నిర్వహిస్తున్న వారు కూడా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవడం లేదని తెలుస్తోంది. అడ్డగోలుగా కిరాయిలు వసూలు చేస్తున్న యజమానులు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జిల్లాలో ఉన్నా ఫంక్షన్‌హాళ్లలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు నివారించుకోవడానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ప్రమాదాలు జరిగినపుడు మంటలు ఆర్పడానికి 15 వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంక్ ఉండాలి. కానీ ఫంక్షన్‌హాల్ నిర్వహణకు, ప్రమాదాలకు కలిపి ఒకే ట్యాంక్ వినియోగిస్తున్నారు. చాలా ఫంక్షన్‌హాళ్లలో పైపులైన్ సిస్టమ్ లేదు. ఫంక్షన్‌హాల్ చుట్టూ ఫైరింజన్ తిరిగేలా ఏర్పాట్లు ఉండాలి. సిరిసిల్లలో ఏ ఫంక్షన్‌హాల్ కూడా పూర్తిస్థాయిలో నిబంధనలతో లేకపోగా, జనావాసాల మధ్య చిన్నచిన్న గల్లీల్లో ఫంక్షన్‌హాళ్లు ఉండడంతో ఒక కారు వెళ్తే ఎదురుగా ద్విచక్రవాహనం కూడా రాలేని పరిస్థితులు ఉన్నాయి. ఇక ఫైరింజన్ వెళ్లే పరిస్థితి లేదు.

● అస్థవ్యస్థంగా పార్కింగ్..

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనే అత్యధిక ఫంక్షన్‌హాళ్లు ఉన్నాయి. వాటికి సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో శుభకార్యాలు జరిగినపుడు రోడ్లపైనే వాహనాలు నిలపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల కోసం కొందరు ఫంక్షన్‌హాళ్ల యజమానులు పార్కింగ్ ప్లేస్ ఒకచోట, ఫంక్షన్‌హాల్ మరోచోట చూపుతున్నారు. సెల్లార్‌లు పార్కింగ్‌కు చూపుతూ బాంక్వెట్‌హాల్‌లకు అనుమతులు పొందుతున్నారు. సెల్లార్‌లలో వాహనాలు నిలపడానికి అనువుగా ఉండని పరిస్థితుల్లో రోడ్లను ఆక్రమిస్తున్నారు. సిరిసిల్లలోని చాలా ఫంక్షన్‌హాళ్ల పరిస్థితి ఇలానే ఉంటే, ఒక ఫంక్షన్‌హాల్ నిర్వహణ మున్సిపల్ రోడ్డునే ఆక్ర మించి జరుపుతున్నారు. ఫంక్షన్‌హాల్ భవనం మాజీ ప్రజాప్రతినిధికి చెందినది కావడంతో మున్సిపల్ రోడ్డును ఆక్రమించినా చుట్టుపక్కల వాళ్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ రోడ్డునే కబ్జా చేసే పరిస్థితుల్లో రోడ్డుపైనే శాశ్వతంగా పందిర్లు వేసి ఉంచడం చేస్తున్నా మున్సిపల్ అధికారులు ...

మిగతా 8లో

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

చందుర్తి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ఎదుట కల్యాణోత్సవానికి ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవమూర్తులను ఆశీనులను చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంతులచారి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణం అంగరంగ వైభవంగా చేశారు. గడ్డం తిరుపతిరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ రాష్ట్ర నాయకులు అల్లాడి రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పల్లం అన్నపూర్ణ, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై అంజయ్య, నాయకులు గడ్డం లక్ష్మారెడ్డి, కట్కం మల్లేశం, ఏనుగు లచ్చిరెడ్డి, లక్ష్మణ్, ముస్కు పద్మ-మల్లారెడ్డి, బుర్ర శ్రీనివాస్, మల్యాల గంగనర్సయ్య, లింగంపల్లి బాబు, చిలుక అంజబాబు, సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, చిర్రం తిరుపతి, మొకిలె విజేందర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

న్యూస్ బాక్స్

గ్రూపు-2లో ర్యాంకు సాధించిన యువకుడికి సన్మానం

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రూప్2 సాధించిన అనంతగిరి గ్రామానికి గొట్టిపర్తి రాకేష్‌ను గౌడసంఘ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడు అంతటి రమేష్, ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్, కోశాధికారి ముంజు భాస్కర్, మాజీ ఎంపీటీసీ కొయ్యడ భాస్కర్, మాజీ అధ్యక్షుడు బండారి సత్తయ్య, సంఘ నాయకులు లింగయ్య, ముంజ భూపతి, రాజు, నాగేంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జగదాంబ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

కోనరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అజ్మీర తండాలో గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ జగదాంబ మాత ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్ఠాపన మహోత్సవానికి సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు నరేష్‌నాయక్, గిరిజన నాయకులు మోహన్ నాయక్, మదన్ నాయక్, ప్రవీణ్ నాయక్, అమృత లాల్, సంతోష్ నాయక్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు

ఎల్లారెడ్డిపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో మరో రెండు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. రాచర్లతిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాచర్లబాకురుపల్లి, జైసేవాలాల్‌తండా గ్రామాలను పంచాయతీలుగా గుర్తించింది. 418 జనాభాతో రాచర్లబాకురుపల్లి, 309 జనాభాతో జైసేవాలాల్ తండాలను పంచాయతీలుగా ఏర్పాటుచేసింది. బుధవారం రాచర్లబాకురుపల్లిలో పంచాయతీ కార్యాలయం కోసం కాంగ్రెస్ నాయకులు స్థానిక సంబు బీరయ్య ఇంటిని పరిశీలించారు. తాత్కాలికంగా పంచాయతీకార్యాలయం ఏర్పాటుకు అనువుగా ఉంటుందని ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. నాయకులు నర్సయ్య, గౌస్, రవీందర్, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, దేవేందర్, లింగయ్య, మహేశ్, నరేశ్, భాగ్యరాజు, సుధాకర్, మురళి, రాజు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిల్లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గర్భస్థ పిండలింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పీవోఎం హెచ్ఎన్ ఇన్‌చార్జి వైద్యుడు సంపత్ కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బుధవారం అధికారులతో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్‌లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వైద్య అధికారులు రాజకుమార్, బాలయ్య, మహేష్, షీ టీం కానిస్టేబుల్ రమాదేవి ఉన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్‌కు ఆత్మీయ వీడ్కోలు

సిరిసిల్ల క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో పనిచేసి ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లిన అఖిల్ మహాజన్‌కు బుధవారం రాత్రి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆయనను గజమాలతో సత్కరించి సేవలను కొనియాడారు. అనంతరం ఎస్పీగా నూతన బాధ్యతలు స్వీకరించిన మహేశ్ బి.గీతేకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళికృష్ణ, ఏవో పద్మ, సీఐలు కృష్ణ, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలు చేయాలి

సిరిసిల్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు ఆరు గ్యారంటీలను అమలుచేయాలని, ఎండిపోతున్నా పంటలకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఐద్వా జిల్లాకార్యదర్శి జవ్వాజి విమల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో అమృతలాల్‌శుక్లా కార్మిక భవనంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐద్వా పతాకాన్ని జిల్లా కార్యదర్శి విమల ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకు పెరుగుతున్న గృహ హింసలు, వరకట్న వేధింపులు, ఇతర అఘాయిత్యాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, అడెపు లావణ్య, లక్ష్మీ, కారంపురి శోభ. అనిత, లలిత తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్



ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఎల్ఆర్ఎస్ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. బుధవారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాపాలన సేవ కేంద్రాన్ని పరిశీలించి, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీ ఫైబర్ సర్వర్ రూంను పరిశీలించారు. అలాగే మండలంలో ఇంటి, ఇతర పన్నుల వసూలుపై ఆరా తీశారు. భూముల క్రమబద్ధీకరణకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని అప్రూవ్ అయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 2893 దరఖాస్తులు అప్రూవ్ అయ్యాయని కలెక్టర్ దృష్టికి ఎంపీడీవో లక్ష్మీనారాయణ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు పిలుపునిచ్చారు. ఇంటి, ఇతర పన్నులను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో మీర్జా తదితరులు పాల్గొన్నారు.

అలాగే నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. ఓపీ, తదితర రిజిస్టర్లను పరిశీలించారు. మందులు ఇచ్చే గది, ల్యాబ్ తనిఖీ చేశారు. మందులు, వ్యాక్సిన్‌లపై ఆరా తీశారు. ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవాలు అయ్యేలా చూడాలని, ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. వైద్యురాలు చంద్రికారెడ్డి, సిబ్బంది ఉన్నారు. అలాగే నేరెళ్లలోని బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇస్తున్న రాగి జావను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు సిద్ధం చేసిన భోజనాన్ని పరిశీలించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు సింగారం, కోరుట్లపేట గ్రామాల్లో వివిధ కారణాలతో మృతి చెందిన రాములు, బాలలింగం, బాలమల్లయ్య, లక్ష్మవ్వ, స్వామి, బాల్‌రెడ్డి కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావులు బుధవారం వేర్వేరుగా పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని సూచించారు. నాయకులు మధు, బాలమల్లు, అనిల్‌రెడ్డి, చిరంజీవి, అమర్, రవి, ప్రతాప్‌రెడ్డి, నర్సగౌడ్, ఉస్మాన్, బాల ఎల్లయ్య, దేవయ్య, సురేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

సిరిసిల్ల టౌన్ 12(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించడంతోపాటు, విద్యాశాఖ మంత్రిని నియమించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లాకార్యదర్శి మంద అనిల్ కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణం సుభాష్ నగర్‌లోని కార్మిక భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి ఉద్యమాలు, భవిష్యత్తు కార్యాచరణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంద అనిల్ కుమార్ మాట్లాడాడు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తైనా, ఇప్పటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల విధానాలను కొనసాగిస్తూ, సమస్యలను నిర్లక్ష్యం చేయడం నిరాశను కలిగిస్తోందన్నారు. విద్యా కమిటీలు కమిషన్లు, ఇతర కమిటీలు కేవలం షోకేస్‌లుగా మారాయని మండిపడ్డారు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు,ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేసేందుకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ కొఠారి కమిషన్ సిఫార్సుల ప్రకారం బడ్జెట్ కేటాయింపులు. విద్యా రంగానికి ప్రొఫెసర్ కొఠారి కమిషన్ సూచించిన విధంగా, కనీసం 30 శాతం నిధులు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. విద్యా రంగ సమస్యలు మరింత తీవ్రతరం కాకుండా విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. ఇది విద్యారంగంలో పాలనాపరమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందన్నారు. మంత్రిని నియమించడం ద్వారా విద్యా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించగలుగుతుందని అభిప్రాయపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్, జిల్లా ఉపాధ్యక్షులు పెండాల ఆదిత్య నాయకులు దొంతి అరుణ్ పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటలో బుధవారం వీధికుక్కలు దాడిచేసి నలుగురిని గాయపరిచాయి. దీకొండ లక్ష్మి, లింగమ్మ, సిర్ర రిషిక, దయ్యాల లస్మయ్యపై కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాధితులకు చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమచికిత్స అందించి అనంతరం కరీంనగర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు. వీధికుక్కలు ప్రమాదకరంగా తయారయ్యాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

జమ్మికుంటలో యువకులపై..


పిచ్చికుక్క దాడిలో గాయపడిన యువకుడు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెం సమీపంలో గల నాయినిచెరువువద్ద బైక్ పై వెళ్తున్న ముగ్గురు యువ కులను పిచ్చి కుక్కల గుంపు వెంబ డించింది. అందులో ఒకపిచ్చి కుక్క దాడి చేయడంతో యువకుడి కాలికి తీవ్రగాయాల య్యాయి. మోత్కుల గూడెంకు చెందిన బిట్ల రాకేష్ అనే యువకుడు తన ఇద్దరు స్నేహితు లతో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. నాయిని చెరువు సమీపం వద్దకు రాగానే వారిని పిచ్చికుక్కల గుంపు వెంబడించింది. వెనుకాల కూర్చున్న రాకేష్‌పై ఓ పిచ్చికుక్క దాడిచేయడంతో ఎడమ కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. స్నేహితులు వెంటనే అతన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక వైద్యం అందించారు.

శంకరపట్నంలో కుక్క, కోతుల దాడి

శంకరపట్నం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కుక్క, కోతులదాడిలో పలువురు గాయపడ్డారు. కేశవపట్నం గ్రామానికి చెందిన స్రవంతి కుక్కదాడిలో గాయపడగా, చింతలపల్లికి చెందిన మల్లారెడ్డి, అంబాలాపూర్‌కు చెందిన మణెమ్మ, మొలంగూర్‌లో జ్యోతిపై కోతులు దాడిచేయడంతో గాయపడ్డారు. కేశవపట్నం పీహెచ్‌సీలో గాయపడిన వారు చికిత్స తీసుకున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ తెలిపారు.

గల్ఫ్ పంపిస్తానని మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసు

జగిత్యాల క్రైం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గల్ఫ్‌దేశానికి పంపిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు బుధవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనేవ్యక్తి ఉపాధికోసం గల్ఫ్ వెళ్లేందుకు జగిత్యాలకు చెందిన అల్లెపు వెంకటేష్ అనే వ్యక్తికి 2022 సంవత్సరంలో రూ.3.5లక్షల నగదు చెల్లించాడు. 2023 సంవత్సరంలో ఆర్మీనియా దేశానికి వెళ్లిన రాకేష్ కొద్ది నెలలకే అక్కడ ఉపాధి లేక స్వదేశానికి తిరిగి వచ్చాడు. తాను మోసపోయానని తెలుసుకుని గల్ఫ్ దేశానికి పంపించిన వెంకటేష్‌ను డబ్బులు తిరిగిచెల్లించాలని నిలదీశాడు. మరోసారి వెంకటేష్ మాయమాటలు విన్న రాకేష్ 2025 జనవరిలో థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ వెంకటేష్‌కు సంబంధించిన వ్యక్తులు రాకేష్‌ను కలిసి బ్యాంకాంగ్ తీసుకువెళ్లి సరైనఉద్యోగం చూపించకుండా ఓ సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పజెప్పారు. దీంతో మరోసారి మోసపోయానని తెలుసుకున్న రాకేష్ ఇండియన్ ఎంబసీ సహాయంతో ఇటీవల స్వదేశానికి వచ్చాడు. తనకు జరిగిన మోసంపై రాకేష్ బుధవారం జగిత్యాల పట్టణపోలీసులకు ఫిర్యాదుచేయగా వెంకటేష్‌పైచీటింగ్ కేసునమోదుచేసినట్లు టౌన్‌సీఐవేణుగోపాల్ పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు

వీణవంక, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామనికి చెందిన దొండపాటి సంపత్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సంపత్ రెడ్డి, ఇంటి ముందు గేటు నిర్మిస్తుండగా అదేగ్రామానికి చెందిన దొండపాటి భగవాన్ రెడ్డి, దొండపాటి పద్మ నానా భూతులు తిడుతూ పిల్లర్లు పగలగొట్టడంతో పాటు గడ్డపారతో సంపత్‌రెడ్డిపై దాడిచేయగా తలకు గాయాలయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన బుర్ర వికాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి న్యూసెన్స్ చేశాడని గ్రామ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు


మల్యాల మండలంలో వ్యవసాయ క్షేత్రాలకు ఏర్పాటు చేసిన రహదారి

జగిత్యాల జిల్లాలో మల్యాల నంబర్‌వన్

సగటున 44.11శాతం కూలీలకు పని

మల్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మల్యాల మండలం జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలుస్తోంది. మండలంలోని 19 గ్రామాల పరిధిలో 10,593 మందికి జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 5,642 కూలీలు పని చేస్తున్నారు. కూలీలకు నిత్యం రూ.275 నుంచి రూ.300 వరకు వేతనం లభిస్తుంది. ఇటీవలి కాలంలో మండల వ్యాప్తంగా లక్షా 95వేల112 పని రోజులు పూర్తి కాగా సగటున 44.11శాతం కూలీలకు పని కల్పించారు. రూ.5.21కోట్ల వేతనాలు కూలీలు అందుకున్నారు. ఏడాదిలో 60 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వంద రోజులు పూర్తి అయ్యేలా ప్రోత్సహిస్తున్నారు. ఉపాధిహామీ పథకం పనుల్లో భాగంగా పొలంబాట కార్యక్రమం కింద వ్యవసాయ భూములకు రహదారుల ఏర్పాటు, రైతుల వ్యవసాయ భూముల వద్ద నీటి నిలువ కుంటలు, పశువు పాకలు, చెరువు పూడికతీతలు, ఇంకుడుగుంతలు మామిడి ప్లాంటేషన్ లాంటి పనులు చేపడుతున్నారు.


ఉపాధి పనుల్లో చేపడుతున్న పశువుల పాక నిర్మాణం

కూలీలకు శిక్షణ

2021 నుంచి 2024 వరకు 100 రోజులు పని చేసుకున్న జాబ్‌కార్డు కుటుంబాలలో విద్యార్హతలను బట్టి 18-45 ఏళ్ల లోపు గల 70మందికి అధికారులు ఇటీవల పుట్టగొడుగుల పెంపకం శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్‌తో పాటు ముద్ర బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నారు. గతంలోనూ మహిళలకు కుట్టు శిక్షణ, బ్యూటిషయన్ కోర్సు, టైలరింగ్, యువకులకు కంప్యూటర్, ఎలక్ట్రిషన్, ప్లంబింగ్ తదితర శిక్షణ ఇవ్వగా స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగావకాశాలు లభించాయి.

ప్రత్యేక పర్యవేక్షణ:శ్రీనివాస్, ఏపీవో, మల్యాల

ఉపాధిహామీ పనుల్లో జిల్లాలోనే మల్యాల ప్రథమ స్థానంలో నిలుస్తోంది. వంద రోజులకు సమీపంలో గల కూలీలను గుర్తించి వారంతా ఈజీఎస్ పనుల్లో పాల్గొనేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం. కూలీల సంఖ్యను మరింత పెంచడం ద్వారా జిల్లాలో ప్రథమ స్థానాన్ని కొనసాగిస్తాం.

అక్రమంగా కట్టిన ఇల్లు సీజ్

సిరిసిల్ల టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కట్టిన ఇల్లును బుధవారం దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ యన్ సుప్రియ సీజ్ చేయించారు. సిరిసిల్ల పట్టణం శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయానికి చెందిన సర్వే నంబర్ 1578విస్తీర్ణం 1.38గుంటల భూమిలో 40సంవత్సరాల క్రితం అక్రమంగా కట్టి దాదాపు 30పక్కా నివాసగృహాలను దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయకమిషనర్ సుప్రియ పరిశీలించారు. ఇటీవల హైకోర్టుఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి ప్రతిఇంటికి రూ.1000 డ్యామేజ్ సూట్ కింద పేమెంట్ చేయాలని సూచించారు. డ్యామేజ్‌చార్జెస్ కట్టనియెడల నివాసగృహాలను కూడా సీజ్‌చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమంగా కట్టిన ఓనివా సగృహాన్ని సీజ్‌చేయించారు. అనంతరం దేవాలయానికి చెందిన 463సర్వేనంబర్ అండ్‌611 భూములను పరిశీలించారు.కార్యక్రమంలో ఈవో మారుతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

రాయికల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని శివాలయానికి సమీపంలో ఉన్న ఆవుల పోషణ నిమిత్తం దాతలు అందజేసిన పశుగ్రాసం దగ్ధమైంది. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు శివసేవకులు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు.

79క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌తో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఫైవింక్లయిన్‌లో బుధవారం అక్రమంగా మహారాష్ట్రకు డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న రేషన్‌బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది మాటువేసి వ్యాన్ (టీఎస్02 యూఏ1517)ను పట్టుకుని అందులో 79.5క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంథనికి చెందిన రాచర్ల రమేష్, మహారాష్ట్ర సిర్వంచకు ఎల్లంకి వీరన్‌లు మంథని ప్రాంతం నుంచి రేషన్ బియ్యాన్ని డీసీఎం వ్యాన్‌లో అనుమానం రాకుండా సగానికి లోడ్‌చేసుకుని తరలి స్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అనుమానం వచ్చి తనిఖీచేయగా రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. దేశెట్టి మారుతి(26) అనే డ్రైవర్‌ను పట్టుకోగా రాచర్ల రమేష్, ఎల్లంకి వీరన్, ఓదెల మహేందర్‌లు పరారీలో ఉన్నారన్నారు. డీసీఎం వ్యాన్ గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

మంథనిరూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకింద సింగరేణి స్వాధీనం చేసుకున్న సిద్దపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీ చేయగా 106 ప్లాస్టిక్ సంచుల్లో నిల్వ చేసిన 54.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉన్నాయన్నారు. వీటిని అక్రమంగా నిల్వ చేసిన ఎండీ రియాజ్‌ను విచారించగా తాను రేషన్‌కార్డు దారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తెలిపారన్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి రైతు మృతి


శ్రీనివాస్ (ఫైల్)

వెల్గటూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగ శ్రీనివాస్ (46) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడవి పందులు ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్ వెల్గటూర్ మండలం ముత్తునూర్ నుండి కొండాపూర్ గ్రామానికి ఇల్లరికం వచ్చాడు. మంగళవారం రాత్రి కెనాల్ ద్వారా వస్తున్న నీటిని తన పొలానికి పెట్టడానికి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో కొండాపూర్ గ్రామశివారులోని తొండం ప్రాంతంలో అడవి పందులు ఢీకొట్టడంతో కిందపడిపోయాడు. తలకు, ఇతరచోట్ల తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బుధవారం మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


యాదగిరిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో రాంచంద్రాపూర్ కాలనీ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాదగిరిరావు(57) దుర్మరణం చెందాడని కరీంనగర్ రెండోటౌన్ పోలీసులు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న యాదగిరిరావును వెనుకవైపు నుంచి కారు అతివేగంగా ఢీకొట్టడంతో కారు బ్యానెట్‌పై పడ్డాడు. అనంతరం కారు అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు, లారీల మధ్య ఇరుకున్న యాదగిరిరావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భల్మారి శ్రీలక్ష్మి తిమ్మాపూర్ మండలం పర్లపెల్లిలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తుండగా, కూతురు మెడికల్ విద్యనభ్యసిస్తున్నట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ రెండో టౌన్ పోలీసులు తెలిపారు.

రాంనగర్‌లో పట్టపగలే చోరీ

- రూ.4లక్షల నగదు, రెండున్నర తులాల బంగారం అపహరణ

కోరుట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రాంనగర్‌లో అయిలాపూర్ పద్మరాణి అనే మహిళ ఇంట్లో పట్టపగలు చోరీ జరిగింది. పద్మరాణి పట్టణంలోని ఇందిరా రోడ్డులో సారి సెంటర్ నడుపుతోంది. మధ్యాహ్నం ఇంటికి తాళంవేసి దుకాణానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రూ.4 లక్షల నగదు, రెండున్నర తులాల బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రామచంద్రుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూజ్ టీం సభ్యులతో తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మృతి

మెట్‌పల్లి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లింగంపల్లి వెంకన్న(60) అనే వృద్ధుడు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన వెంకన్న ఫిబ్రవరి 25న మెట్‌పల్లిలో పనులు ముగించుకుని ముత్యంపేటకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సు వేంపేట గ్రామ శివారులో ఢీకొట్టగా వెంకన్నకు తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వెంకన్న మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుడి కుమారుడు అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సర్వర్ పాషా (ఫైల్)

బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్..

పెగడపల్లి, మార్చి12(ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్ పాషా (55) చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న రాత్రి గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా కారు ఢీకొనడంతో సయ్యద్ సర్వర్‌పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. కాగా అదేప్రమాదంలో గాయపడ్డ సర్వర్ పాషా సోదరుడు జాకీర్‌పాషా పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి బలవన్మరణం

ముత్తారం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన చొప్పరి శ్రీనివాస్(48) అనేవ్యక్తి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. శ్రీనివాస్ కొంతకాలంగా అనారోగ్యంతోపాటు మతిస్థిమితం లేక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురు చూపులు

- మూడు దశాబ్దాలుగా ఆర్టీసీలో సేవలు
- పదవీ విరమణ చేసి ఏళ్లు గడిచినా అందని బకాయిలు
- ఆర్టీసీలో రిటైర్డ్ కార్మికుల అరణ్యరోదన
- చనిపోయిన తరువాత ఇస్తారా అని ఆవేదన


డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు

కళ్యాణ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పాటు వారు ఆర్టీసీలో సేవలందించారు. పదవీ విరణ చేసిన తర్వాత వారికి ఆర్థిక భద్రత లేకుండాపోయింది. ఏళ్ల గడిచినా ఇప్పటి వరకు వారికి రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించకపోవడంతో ఆర్‌టీసీ రిటైర్డ్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1200 మంది రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన బకాయిలను యాజ మాన్యం ఇప్పటి వరకు చెల్లించ లేదు. ఓ కార్మికుడు బకాయిలు వస్తాయో రావోనని మనోవేదనతో మృత్యువాత పడినా యాజమాన్యం స్పందించడం లేదు. గోదావరిఖని ఆర్టీసీ డిపోలో సుమారు వంద మంది పదవీ విరమణ చేయగా బెనిఫిట్స్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2015 నుంచి ఫిక్సేషన్ అరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఒక్కో కార్మికుడికి ఏడు లక్షల నుంచి 23 లక్షల రూపాయల వరకు రావాల్సి ఉంది. మృతి చెందిన కార్మికులకైనా అరియర్స్ చెల్లించాలని వేడుకున్నా యాజమాన్యం తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 24న ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులు గోదావరిఖని డిపో ఎదుట ఆందోళనకు దిగి తమకు రావాల్సిన అరియర్స్‌ను చెల్లించాలని డిపో మేనేజర్ నాగ భూషణానికి వినతిపత్రం అందించారు. పదవీ విరమణ పొంది ఏడేళనా తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో మనోవేదనతో హనుమయ్య అనే డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. పలువురు అనారోగ్యానికి గురై జీవితాన్ని గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు వస్తాయో, రావోనని కలత చెందుతున్నారు. తమ సమస్యలను ఎండీకి విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ కూడా చాలా తక్కువ వస్తుందని, బకాయిలను చెల్లించే విధంగా కృషి చేయాలని వారు అధికారులను కోరుతున్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

చావే శరణ్యం...


నాగేందర్, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



32ఏళ్ల ఆర్టీసీకి సేవ చేశాం. మాకు రావాల్సిన డబ్బులు ఇవ్వడం లేదు. రిటైర్డ్ అయి ఐదేళ్ల అయినా రూ.23 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. వాటి వడ్డీ కలిపి అరియర్స్‌ను చెల్లించాలి. కుటుంబ పోషణ భారమవుతుంది.

పెన్షన్ కూడా తక్కువే..

కనకయ్య, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



ఆర్టీసీలో నేను 22ఏళ్ల డ్రైవర్‌గా పని చేశా. పెన్షన్ కూడా తక్కువగానే ఉంది. పెన్షన్ రూ.2500 కూడా రావడం లేదు. దీనికి తోడు ఆర్టీసీ నాకు బెనిఫిట్స్‌ను కూడా ఇవ్వలేదు. 2013 నుంచి ఆర్‌పీఎస్ బాండ్ బకా యిలు రావడం లేదు. రెగ్యులర్ ఎంప్లాయిస్‌కు నెల రోజుల్లోనే ఫ్రీక్వెన్సి చేస్తున్నారు. మాకు మాత్రం కాలయాపన చేస్తున్నారు. ఇది సరైంది కాదు.

రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తాం...

తిరుపతి, రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుడు



మాకు రావాల్సిన అరియర్స్ బకాయిలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తాం. ఇప్పటికే పలు డిపోల్లో ఆందోళనలు మొదలయ్యాయి. అవసరమైతే విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి సమ్మెకు దిగుతాం.

మహిళా అఘోరీ హల్‌చల్..

- జిల్లా సరిహద్దులో రెండు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు
- వేములవాడకు వెళ్లే ప్రయత్నాన్ని అడ్డుకున్న పోలీసులు


మహిళా అఘోరీని తరలిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళాఅఘోరీ జిల్లా సరిహద్దుల్లో మరోసారి హల్‌చల్ సృష్టించింది. బుధవారం జిల్లా సరిహద్దులోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామశివారులో మహిళాఅఘోరీని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. గతంలో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న సందర్భంలో దేవస్థానం ప్రాంగణంలో ఉన్నదర్గాను కూల్చివేస్తానని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈక్రమంలో గతనెల ఫిబ్రవరి3న కూల్చివేయడానికి రావడంతో ముందస్తుగానే జిల్లాసరిహద్దులో మహిళా అఘోరీని అడ్డుకొని సిద్దిపేటకు తరలించారు. మరోసారి వేములవాడకు మహిళా అఘోరీ వస్తుందని సమాచారంతో జిల్లాసరిహద్దులో భారీగా పోలీసులను మోహరించారు. సిద్దిపేట-సిరిసిల్ల ప్రధానరహదారిపై జిల్లెల్ల వద్ద 50మంది పోలీసులతో ప్రత్యేక పికెట్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీచేశారు. మధ్యాహ్నం నుంచే పోలీస్ చర్యలు మొదలవగా సాయంత్రం 5 గంటల ప్రాంతంలో జిల్లాసరిహద్దుకు మహిళా అఘోరీ వాహనం చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. కారులోంచి దిగకుండా పోలీసులపై పరుష పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హల్‌చల్ చేసింది. తనను అడ్డుకుంటే కత్తితో చేతిని కోసుకుంటానని బెదిరించింది. దీంతో మహిళా పోలీసులు మహిళా అఘోరీని బలవంతంగా కారులోంచి దింపి శరీరంపై దుప్పటి కప్పారు. అనంతరం మహిళా అఘోరీని పోలీస్ వాహనంలో సిద్దిపేటకు తరలించారు. కారును టోఫన్ సహాయంతో సిద్దిపేట వైపు తీసుకెళ్లారు. సీఐలు శ్రీనివాస్‌గౌడ్, సదన్ కుమార్, ఎస్ఐలతో భారీ బందోబస్తులో నిర్వహించారు.

కేజీబీవీ పాఠశాల విద్యార్థినికి గాయాలు

తిమ్మాపూర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల(కేజీబీవీ)లో 10వ తరగతి చదువుతున్న మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లికి చెందిన అనన్య ప్రమాదవశాత్తు గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం పాఠశాలలో బుధవారం రాత్రి విద్యార్థినుల మధ్య ఘర్షణ జరిగింది. పెనుగులాటలో అనన్యకు కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది అనన్యను అసుపత్రికి తరలించగా చేయి విరిగినట్లు గుర్తించారు. అసలు ఏం జరిగిందనే దానిపై అధికారులను తెలుసుకునే ప్రయత్నం చేయగా వారు స్పందిచలేదు.

రాజన్న ఆలయంలో కామ దహన ఉత్సవం



కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ కల్చరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కామదహన ఉత్సవాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ ఆవరణలో రాత్రి ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి కామ దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా రాజన్న ఆలయ మండపంలో డోలోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి



పెగడపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా ఎంపీడీవోలు, మండల పరిషత్ ఉద్యోగులు అభినందించారు.

రైతులకు వరం
పీఎం కిసాన్ మన్‌ధన్



- 60 ఏళ్లు దాటిన రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ.55 నుంచి ప్రీమియం

చొప్పదండి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం రైతులకు వరంగా మారనుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేయకున్నా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజన' పథకాన్ని తీసుకువచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలా మంది రైతులకు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవు. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్న కారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతి నెల 3 వేల రూపాయల చొప్పున పింఛన్ జీవిత కాలం అందుతుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉం డి, రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్నవారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60 ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ పెన్షన్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ధ సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగినవారు, టాక్స్ పేయర్లు ఈ పథకానికి అర్హులు కాదు. ఈ పెన్షన్ అందే వరకు రైతులు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమ చేస్తుంది.

ప్రీమియం వివరాలు

18 నుంచి 40 సంవత్సరాల వయస్సులోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెల 55 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు 55 రూపాయలు జమ చేస్తే ప్రతి నెల 110 రూపాయలు జమ అవుతుంది. 20 ఏళ్ల వయస్సు గల రైతులు 61 రూపాయల ప్రీమియం, 25 ఏళ్ల వారికి 80, 30 ఏళ్లకు 105, 35 ఏళ్లకు 150, 40 ఏళ్ల వయస్సు వారికి ప్రీమియం 200 రూపాయలుగా ఉంటుంది. రైతు మరణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించవచ్చు. 60 ఏళ్ల తరువాత రైతు మరణిస్తే భార్యకు 1500 రూపాయల పెన్షన్ వస్తుంది. రైతు ఫోటో, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్, వయస్సు నిర్ధారణ, సాగు భూమి, ఆదాయం వంటి వివరాలను, పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఈ కిసాన్ మాన్‌దన్ పదకంలో చేరాలంచే కామన్ సర్వీస్ సెంటర్లలో రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



దరఖాస్తు చేసుకోవడం ఇలా

- పీఎం కిసాన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి.
- పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతి నెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి.
- నామినీ వివరాలను నమోదు చేయాలి.
- మాన్‌ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి.
- వెంటనే మీకు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రతి నెలా బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎం. కేఎంవై పథకానికి ఆటోమేటిక్‌గా జమ అవుతాయి.
- పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్‌సీలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకొని ఫించన్ కార్డును డౌన్‌లోడ్ చేసకోవచ్చు.
- ప్రీమియం డబ్బును నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

భగత్‌నగర్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగులకు పదోన్నతితోపాటు, బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు బుధవారం బస్ బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కరీంనగర్-2 డిపో మేనేజర్‌గా పని చేస్తున్న విమలయ్యకు ఖమ్మం డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించారు. బోధన డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను కరీంనగర్ డపో-2 మేనేజర్‌గా బదిలీచేశారు. జగిత్యాల డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న జి.సునీతను గద్వాల్ డిపో మేనేజర్‌గా, ఆదిలాబాద్ డిపో మేనేజర్ కె.కల్పనను జగిత్యాలడిపో మేనేజర్‌గా, హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును కుషాయిగూడకు బదిలీ చేశారు. దిల్‌సుక్‌నగర్‌లో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎస్.వెంకన్నను హుస్నాబాద్ డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ సీవోఎస్‌గా పనిచేస్తున్న పీవీ రావును కరీంనగర్ డిప్యూటీ ఆర్ఎంగా బదిలీ చేసినట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

చదువుతున్న కాలేజీలోనే గంజాయి అమ్మకం

విద్యార్థి అరెస్టు.. 1.30 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న కాలేజీలోనే గంజాయి విక్రయిస్తున్న విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1.30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘటకేసర్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. గంజాయి సేవించడానికి అలవాటు పడిన అతడు అధిక ఆదాయం కోసం బీదర్ నుంచి గంజాయి తీసుకొచ్చి తాను చదువుతున్న కాలేజీలో విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం రాజును అరెస్ట్ చేసింది. నిందితుడి నుంచి 1.30 కిలోల గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ

- గోదావరి నదిలో పుణ్య స్నానాలు
- స్వామి వారల సేవ ఊరేగింపు



స్వామివారల ఊరేగింపు

ధర్మపురి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో బుధవారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. రాత్రి వేళలో శ్రీ స్వామి లక్ష్మీ నరసింహ (యోగ, ఉగ్ర) స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగింపు జరిపారు. స్వామి వారల సేవలు పుర వీధుల గుండా ఇసుక స్తంభం వద్దకు తీసుకు వచ్చి ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ వేద మంత్రాల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం పక్షాన రైస్‌మిల్ యజమానులు, దాతల సహకారంతో 7 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు జక్కు రవీందర్ సేవలు అందించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం కోశాధికారి రంగ శంకరయ్య, సత్రం కోశాధికారి జక్కు దేవేందర్ పాల్గొన్నారు.

రెండో రోజు ఆదాయం రూ.5,14,052

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి బుధవారం రూ.5,14,052 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో స్వామి వారల వివిధ రకాల పూజల టికెట్ల విక్రయం ద్వారా 2,76,482, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 1,61,850 లభించగా, అన్నదానం కోసం భక్తులు, దాతల ద్వారా సేకరించిన రూ 75,720 విరాళాలు ఉన్నట్లు ఆయన వివరించారు.



చలవ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి 7 గంటలకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఊరేగింపు సేవ ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి స్థానిక కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయ 13 మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయ కమిటీ సభ్యులుగా ఎదులపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, జక్కు రవీందర్, కొమురవల్లి పవన్ కుమార్, మందుల్ల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంబంకాడి గణేష్ కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్‌లను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నేరేళ్ల శ్రీనివాసా చార్యులను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.





స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, స్వామివారి దర్శనం కోసం ఆలయం బయట బారులు తీరిన భక్తులు

వైభవంగా పూర్ణాహుతి

కొండగట్టులో ముగిసిన పవిత్రోత్సవాలు




పూర్ణహూతి నిర్వహిస్తున్న వేదపండితులు

మల్యాల, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో బుధవారం పూర్ణాహుతి వైభవంగా జరిగింది. మూడు రోజులుగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు బుధవారంతో ముగిసాయి. స్వామి వారికి క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లిదళ అర్చన, పట్టు వస్త్రాలంకరణ, దివ్య ప్రబంద పారాయణం, హవనం, పూర్ణాహుతి, దేవతా ఉద్వాసనం, శ్రీ స్వామి వారికి పవిత్రధారణ, మహదాశీర్వచనం, పండిత సన్మానం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో పవిత్ర ప్రధానం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు అర్చకులు, వేదపండితులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ఆలయ స్థానాచార్యులు కపీంధర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్ర ప్రసాద్, రఘు ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఉపప్రధానర్చకులు చిరంజీవి, మారుతీ, సిబ్బంది అశోక్, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పవిత్రల ఆలయ ప్రవేశం


సైలెంట్‌గా ఎటాక్



- పెరుగుతున్న కిడ్నీ బాధితులు
- ఆరోగ్యంగా జీవించడానికి మూత్రపిండాలు ప్రధాన పాత్రే..
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కిడ్నీ జబ్బు మనుషులపై సైలెంట్ ఎటాక్ చేస్తుంది. ఎక్కువ శాతం బాధితులు ముందుగా లక్షణాలను గుర్తించకపోవడంతో కిడ్నీ ఫెయిల్‌కి కారణం అవుతుంది. కిడ్నీ సమస్యలు పెరిగిపోతున్న క్రమంలో ప్రపంచ కిడ్నీ ఫెడరేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ అనే రెండు సంస్థలు కిడ్నీలపై అవగాహన కల్పించాలని ప్రతి సంవత్సరం మార్చి రెండవ గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఒక అంశాన్ని తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సంవత్సరం ముందస్తుగానే సమస్యను గుర్తించి నివారణ - సంరక్షణ అంశంగా ముందుక తీసుకువచ్చింది. చిక్కుడు గింజల ఆకారంలో.. పిడికిలి ప్రమాణంలో.. నడుముకు పైభాగంలో.. పక్కటెముకల కింద మన శరీరానికి రెండు వైపులా ఉండే మూత్రపిండాలు(కిడ్నీలు) ఆరోగ్యంగా జీవించడానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి రోజూ లీటర్ల కొద్దీ రక్తాన్ని శుద్ధి చేస్తూ, వ్యర్థ పదార్థాలను బయటకు పంపుతూ నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాలతో ఇప్పుడు ఎంతో మంది కిడ్నీల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.



మూత్రపిండాల పనితీరు..

ప్రతి రోజూ కిడ్నీలు రెండువందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేసి రెండు లీటర్ల మలినాలను, అధికంగా ఉన్న నీటిని తీసివేస్తాయి. అలా ప్రతిరోజూ మూత్రపిండంలో 24 గంటలు బొట్లు బొట్లుగా నీరు మూత్రపిండాల్లో ఉత్పత్తి అవుతూనే ఉంటుంది. యురేటర్ అనే రెండు గొట్టాల ద్వారా మూత్రాశయానికి చేరుతుంది. ఈ సంచి నిండగానే మూత్ర విసర్జన చేసుకోవాలని మెదడులో ఆలోచన కలుగుతుంది. తినే ఆహారంలోని రక్త ప్రవాహం కలిసినప్పుడు అనవసరమైన పదార్థాలు కొన్ని రక్తంలో చేరుతాయి. అలా చేరిన మలినాలను మూత్రపిండాలు సత్వరం శరీరం నుంచి బహిష్కరించకపోతే విషపూరితం అవుతాయి. ఈ పనిని కిడ్నీలు చేస్తాయి.

మూత్రపిండాలకు హాని కలిగించే పరిస్థితులు..


మూత్రపిండాలు ప్రాణాపాయ స్థితికి కూడా చేరుకుంటాయి. దెబ్బలు తగలడం, మితిమీరిన రక్తపోటు, అధిక బ్లడ్‌షుగర్, కొన్ని రోగాలకు వాడే మందుల వల్ల మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటుంది. మంచి అలవాట్లు వీటిని నియంత్రిస్తాయి. బరువును అదుపులో పెట్టుకోవడం, పొగతాగడం మానటం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

కిడ్నీల్లో రాళ్లు..

కిడ్నీల్లో రాళ్ల తయారు కావడానికి ప్రధానంగా తినే ఆహారంలో కాల్షియం సాల్ట్, యూరిక్ యాసిడ్, ఆక్జలైట్, సిస్టిన్ మొదలైన పదార్థాలు ఎక్కువగా ఉండడం. మూత్రం మండలంలో లోపలి పొర దెబ్బతినడం, ఏ విటమిన్ లోపించడం, మూత్ర విసర్జనకు అవరోధం ఏర్పడడం, మూత్రమండలంలో ఇన్‌ఫెక్షన్స్ రావడం, మంచినీళ్ల తక్కువ తాగడం, ప్రొస్టేట్ గ్రంథి వాయడం జరుగుతుంది. రాళ్ల ఎక్కడున్నాయి అనే దాన్ని బట్టి లక్షణాలు వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి..

ముందుగా జబ్బు నిర్ధారణ చేసుకుని అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే ద్వారా కూడా తెలుసుకోవచ్చు. చిన్నరాళ్లయితే కొంత కాలానికి వాటంతట అవే పోతాయి. అందుకోసం అధిక నీళ్లు తాగితే సరిపోతుంది. రాళ్లు ఉన్నాయని నిర్ధారణ తరువాత ఎక్కువ నీళ్లు తాగాలి. నొప్పి తగ్గడానికి పెయిన్ కిల్లర్స్ మాత్రలు, చీము కణాలుంటే యాంటీబయాటిక్స్ వాడాలి. చిన్న రాళ్లయితే మూత్రంలో పడిపోతాయి, పెద్దగా ఉంటే మూత్రపిండాలు చెడిపోకముందే సర్జరీ ద్వారా తీయించుకోవాలి. ఒకసారి రాళ్లు తీయించుకుంటే మళ్లీ రావని అనుకోవద్దు.



అన్ని రంగాల్లో డిజిటల్ పరివర్తన

గణేశ్‌నగర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో మార్పునకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిజిటల్ పరివర్తన అన్ని రంగాల్లో స్థిరమైన స్థానాన్ని సాధిస్తోందని శాతావాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ అన్నారు. 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఏకీ క్యాటలిస్ట్ ఫర్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కొవిడ్ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ వ్యాపారాలు పెరిగాయని, మారుమూల గ్రామాల్లోనూ డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో ఇలాంటి సమాకాలిన అంశాలపై సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గుప్తా లక్ష్మణ్ సెక్రెటరీ ఏబీఆర్ఎస్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి పథంలో నడవడానికి విద్య ముఖ్యమైన సాధనమని, విద్యా రంగంలో సమూలమైన మార్పులు తేవడానికి ఆధునికతతో కూడిన అంశాలను జోడిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. విశ్వేశ్వరరెడ్డి కలవల గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఫౌండర్ అండ్ ఛైర్మన్, ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి డైరెక్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ హైదరాబాద్, డాక్టర్ రవి జాస్పర్ ఇండస్ట్రీస్, విశ్వావిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ పాల్గొన్నారు.

రైతుల నిరసనలను పట్టించుకోని ప్రభుత్వం..



రిలే నిరాహారదీక్షలో మహిళా రైతులు

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కరించాలని రైతులు నిరసనలు చేపట్టినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహిళా రైతులు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 11వ ప్యాకేజీలో భాగంగా ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తిచేయాలని పెద్ద లింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష బుధవారం 10వ రోజుకు చేరుకోగా దీక్షలో మహిళా రైతులు కూర్చున్నారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కెనాల్ పనులు పూర్తిచేసి సాగు నీరు ఇవ్వాలని నిరసన చేపట్టినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రెండు మండలాల రైతుల దీక్షలు చేస్తున్నా ఎమ్మెల్యేలు రాకపోవడం బాధాకరం అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. మహిళా రైతుల దీక్షకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య సంఘీభావం ప్రకటించారు.

మహిళలు అక్షరాస్యత, ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు

- మల్లేశం, సెర్ప్ ఏపీఎం



ఆంధ్రజ్యోతి: మహిళల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏపీఎం: మండలంలోని మహిళా సంఘాల్లో చేరిన మహిళలు అక్షరాస్యత, ఉపాధి మార్గాలు పొందేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం. ధాన్యంకొనుగోలు బాధ్యతలను అప్పగిస్తున్నాం. కుట్టుశిక్షణ, కుట్టుఅల్లికలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మహిళలకు ఎలాంటి రుణాలు అందజేస్తున్నారు?

ఏపీఎం: మండలంలో మొత్తం 46గ్రామ సంఘాల్లో 1160స్వయం సహాయక సంఘాలున్నాయి. బ్యాంక్ లింకేజీ ద్వారా 363 సంఘాలకు రూ.54.77లక్షలు, స్త్రీనిధి పథకం కింద రూ.7.84 కోట్ల రుణాలను అందించాం. ఇంటివద్దే కిరాణ దుకాణం, గాజుల దుకాణం, తినుబండారాల తయారు, నాటు కోళ్ల పెంపకం చేపట్టారు.

ఆంధ్రజ్యోతి: మహిళల ఆరోగ్యంపై ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఏపీఎం: సంఘాల్లోని సభ్యులకు నెలవారి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం, రక్తహీనత తదితర సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

- ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి)

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి - విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



సిరిసిల్లలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న జిందం కళ



ఎల్లారెడ్డిపేటలో పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు, నాయకులు

సిరిసిల్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి అన్నారు. బుధవారం సిరిసిల్లలోని శివనగ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, గడ్డం లత, బీఆర్ఎస్ విద్యార్థి రాష్ట్ర కార్యదర్శి హరీష్, జిల్లా అధ్యక్షుడు అరుణ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్...

సిరిసిల్లలో సూర్య ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. బుధవారం ఫుడ్ ఫెస్టివల్‌ను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణలు ప్రారంభించారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ గడ్డం లత తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని రేపాక గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయిని రొండ్ల ఊర్మిళ పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిణి రేవిత, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మీసాల లీల, ఉపాధ్యాయులు సింగిరెడ్డి వీరారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, అబ్రార్‌అహమ్మద్, మల్లికార్జున్, మాధవి, సుజాత, పూజ, మల్లయ్యలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు..

●ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతోపాటు నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్పూర్ తదితర గ్రామాల్లోని పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సమకూర్చిన పరీక్ష సామగ్రిని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, తాజా, మాజీ ఎంపీపీ రేణుక, నాయకులు సుభాష్, నర్సింహారెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, బాల్‌రెడ్డి, రమేశ్, దేవరెడ్డి, పర్శరాములు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, రాజం, సందీప్, శివరామకృష్ణ, దేవేందర్, నాగరాణి, అప్సరున్నీసా పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందించారు. సెస్ డైరెక్టర్ మాడు గుల మల్లేశం, బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మాజీ మండల అధ్యక్షుడు శ్రీరాం నాయక్, మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్, నాయకులు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, సాదుల భాస్కర్, అలువాల సాయి,ప్రిన్సిపాల్ విఠల్ పాల్గొన్నారు.

నిబంధనలు గాలికి..

(5వ పేజీ తరువాయి)

పట్టించుకోకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. కాగా, ఇళ్లమధ్య సరైన స్థలాలు లేక ఏ చిన్న శుభకార్యం అయినా ఫంక్షన్ హాళ్లపైనే ఆధారపడుతున్నారు. పుట్టిన రోజు వేడుకల నుంచి పెళ్లిళ్ల వరకు, కర్మల వంటి కార్యక్రమాలు కూడా ఫంక్షన్ హాళ్లలోనే నిర్వహిస్తున్నారు. పెండ్లిల సీజన్‌లలో యజమానులు భారీగా వసూళ్లు చేస్తున్నారు. రూ.50 నుంచి రూ.లక్ష వరకు హాల్ కిరాయిలు అవుతుండగా, డేకరేషన్‌ల పేరుతో అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఏసీ వేస్తే అదనం, టేబుల్‌లు, కుర్చీలు, మ్యాట్‌లు, ఇతర సామగ్రిలతో తడిసిమోపెడు అవుతుంది. టెంట్ హౌస్ నిర్వాహకులతో సిండికేట్‌గా మారి హాల్ యజమానులు కమీషన్లు తీసుకోవడంతో సామాన్య ప్రజలకు ఫంక్షన్‌హాల్ అంటేనే ఇబ్బందిపడే పరిస్థితి ఉంది. లక్షల్లో వసూలు చేస్తున్నా యజమానులు నిబంధనలు మాత్రం పట్టించుకోవడం లేదు.

సర్వీస్ ట్యాక్స్‌లకు ఎగనామం..

జిల్లా కేంద్రంలో ఫంక్షన్‌హాళ్ల యజమానులు మున్సిపాలిటీకి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు, సర్వీస్ ట్యాక్స్‌లు చెల్లించాలనే నిబంధనలున్నా చెల్లించడం లేదనే తెలుస్తోంది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో యజమానుల ఇష్టారాజ్యానికే వదిలేసినట్లుగా మారింది. కనీసం ట్రేడ్‌లైసెన్స్‌లు కూడా తీసుకోవడం లేదు. వివాహాల సమయంలో క్యాటరింగ్ పద్ధతిలో భోజన సదుపాయాలు కొనసాగితే అందుకు సంబంధించిన ట్యాక్స్‌లు కూడా ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు ఫంక్షన్‌హాళ్లపై చూపుతున్న ఉదాసీనతపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

9వ ప్యాకేజీ పెండింగ్ పనులు పూర్తి చేయాలి...

వీర్నపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మల్కపేట రిజర్వాయర్ 9వ ప్యాకేజీలో పెండింగ్‌లో ఉన్న రాయిని చెరువు లిఫ్ట్‌ఇరిగేషన్ పనులను పూర్తిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మాలోతు లక్పతి నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో మారుతిరెడ్డికి బీజేపీ నాయకులు, రైతులతో కలిసి బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9వ ప్యాకేజీలో పెండింగ్ పనులను వెంటనే ప్రారంభించి రాయిని చెరువును నీళ్లతో నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. రాయినిచెరువు ఎండిపోవడంతో ఆయకట్టు పొలాలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. చెరువు నింపితే గొలుసు కట్టు చెరువులు నిండి మండలంలోని రైతుల పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పెండింగ్ పైప్‌లైన్ పనులను పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, బూత్ అధ్యక్షులు బండారి మహేష్, నాయకులు రమేష్, నరేష్, శ్రీనివాస్, వెంకటేష్, లింబాద్రి, రవి, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యవర్గం

వేములవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ వేములవాడ పట్టణ శాఖ కార్యవర్గాన్ని నియమించినట్లు అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా అక్కపల్లి వివేక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కటుకం శ్రీనివాస్, అన్నం నర్సయ్య, కోశాధికారిగా పోత్తూరి వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా సామల శివాని, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా వెల్ది రాధిక, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షునిగా గడ్డమీది శ్రీనివాస్, యువ మోర్చా పట్టణ అధ్యక్షునిగా కీసరి యశ్వంత్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన కోరారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

ఇల్లంతకుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీలపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ రమేష్‌యాదవ్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల ద్వారా సులభంగా, వేగవంతంగా డబ్బులను మార్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, ఎస్ఎంబీ లక్ష్మీనారాయణరెడ్డిలతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఉపాధ్యాయులకు సన్మానం



మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఎంఈవో మురళి నాయక్

కోనరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ ఉపాధ్యాయులను మండల విద్యాధికారి మురళి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, కమలాకర్, నాగరాణి, స్వప్న, కృపారాణి, పద్మ, భాగ్యలక్ష్మి, రేణుక, తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

వీర్నపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కవి, రచయిత నాగిళ్ల రమేష్‌ను ఎంఈవో తుమ్మ శ్రీనివాస్, ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. రమేష్ ఇటీవల సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం నుంచి ప్రతినిధిగా వెళ్లి దళిత చేతన సదస్సులో పాల్గొన్నారన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ద్వారా జాతీయ సదస్సులో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బొప్పాపూర్, నారాయణపూర్ ప్రధానోపాధ్యాయులు మధు మాలతి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, తుకారం, కవిత, శ్రీనివాస్, రమాదేవి, చామంతి, కనకరాజు పాల్గొన్నారు.

విద్యా రంగానికి నిధులు కేటాయించాలి

కోనరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పూజ్యం కార్తీక్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని కోరారు. గత సంవత్సరం బడ్జెట్‌లో ఏడు శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేయాలని కోరారు. సమావేశంలో ఏబీవీపీ మండల కన్వీనర్ ఇట్టిరెడ్డి గణేష్, నందగిరి గణేష్, చరణ్, అభిషేక్ ఉన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

కోనరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల అధ్యక్షురాలు జవాజి విమల అన్నారు. మండలంలోని మరిమడ్ల గ్రామంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న మహిళా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని అనంతరం మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా మరిమడ్ల శివారులోని పోడు భూములను సాగు చేసుకుంటున్న నిరుపేద రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వెంట సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

వీర్నపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కల్పిస్తున్న ఎల్ఆర్ఎస్ రాయితీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ అన్నారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటా తిరుగుతూ ఎల్ఆర్ఎస్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎల్ఆర్ఎస్ లేని ప్లాట్లకు భవిష్యత్తులో ఎలాంటి అనుమతులు ఇవ్వరని, రిజిస్ట్రేషన్‌లు కావన్నారు. వెంట పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, నీతా, స్రవంతి, వెన్నెల ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి కృషి

ఎల్లారెడ్డిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో రాజకీయాలకు తావ్వికుండా ప్రజలందరూ ఐక్యతతో ముందుకు వస్తే వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి కృషి చేస్తామని సభ్యులు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా తమ స్వంత స్థలాలను ఆలయానికి విక్రయించిన చిన్నభాస్కర్, తుమ్మల సుధాకర్, రాగుల వెంకట్‌రెడ్డి దంపతులను సభ్యులు బుధవారం సన్మానించారు. అలాగే నూతనంగా ఎన్నికైన మండల ప్రెస్‌క్లబ్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సభ్యులు రవీందర్, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఈశ్వర్, రవీందర్‌రెడ్డి, నర్సయ్య, రాజం, నర్సింలు, పర్శరాములు, దేవదాస్, నర్సయ్య, మల్లారెడ్డి, నంది కిషన్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

- బీఆర్ఎస్ నేత చల్మెడ లక్ష్మీనరసింహారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : గత 14 నెలలుగా ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా తప్పుడు ఆరోపణలతో కాలం గడుపుతూ ప్రజలను మభ్య పెడుతున్నారని వేములవాడ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. బుధవారం ఆయన వేములవాడలోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీరును విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నప్పటికీ నియోజకవర్గంలో ఒక్క రూపాయి పని కూడా చేయకుండా గత 10సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదంటూ తప్పుడు విమర్శలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, గత 14 నెలల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృధి పనులపై చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలో సాగునీటి ప్రాజెక్టులపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో సమగ్రంగా వివరించారు. గత 50ఏండ్ల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ చరిత్రలో జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తికాలేదని, 2014తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై బీఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో జిల్లాలోని అప్పర్ మానేర్, మిడ్ మానేర్, లోయర్ మానేర్‌లను పునరుద్ధరించి ఒక్క ప్రాజెక్టు కింద లక్ష ఎకరాల నీరందించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. తమపై అసత్యప్రచారాలు మానుకొని నియోజకవర్గంలోని కలికోట సూరమ్మ చెరువు, మల్కపేట రిజర్వాయర్, అప్పర్‌మానేర్‌ల పెండింగ్ పనుల్ని పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, రాజన్న ఆలయ అభివృద్ధి చేయాలని, మిడ్‌మానేర్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. రాజకీయపరమైన కారణాలతో చేస్తున్న తప్పుడు విమర్శలు మానుకుని ప్రజలకు, రైతాంగానికి అవసరమైన పనులు చేస్తే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను తామే ఘనంగా సన్మానిస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, వేములవాడ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 24 గంటల్లో 14 ఆపరేషన్లు..

- మరో ఐదు సాధారణ ప్రసవాలు

వేములవాడ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 24 గంటల్లో 14 ఆపరేషన్లుతో పాటుగా ఐదు సాధారణ కాన్పులు విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. డాక్టర్ పెంచలయ్య ఆధ్వర్యంలో ఆరుగురికి ఆపరేషన్ ద్వారా డెలివరీ, ఇద్దరికి గర్భసంచి తొలగించగా, ముగ్గురికి కంటి ఆపరేషన్లు, మరో ముగ్గురికి జనరల్ సర్జరీలు చేపట్టినట్లు తెలిపారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టుల సేవలు అందుబాటులో ఉన్నాయని, జిల్లా ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. గైనకాలజీ విభాగంలో ముగ్గురు మెడికల్ కాలేజీకి సంబంధించిన ప్రొఫెసర్లు, జనరల్ సర్జరీలో ఇద్దరు వైద్యులు ఆపరేషన్లు నిర్వహించినట్లు వివరించారు.

యాసంగిలో ఆరుతడి పంటలను పండించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

రుద్రంగి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం సూచించారు. మండల కేంద్రంతోపాటు మానాలలో అఫ్జల్ బేగం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి కాలంలో ముందస్తుగా వరి పంటను నాటుకున్నట్లైతే వరిలో ఆఖరి దశ నీటి ఎద్దడి నుంచి కాపాడుకొని అధికలాభాలు పొందవచ్చని సూచించారు. మానాలలో యసంగిలో ఆరుతడి పంటలు పండిస్తూ అధిక లాభాలు గడిస్తున్న రైతు జక్కు మహేష్‌ని ఆదర్శంగా తీసుకొని ఇతర పంటలను సాగు చేసుకొని తక్కువ నీటితో ఎక్కువ ఎకరాలు సాగు చేయవచ్చని సూచించారు. ఆరు తడి పంటలలో డ్రిప్, స్ప్రింక్లర్లను ఉపయోగించడం ద్వారా నీటి వృథాను తగ్గించి తక్కువ నీటితో అధిక లాభాలు రైతులు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో దుర్గరాజు, రుద్రంగి మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, ఏఈవో జ్యోతి, రైతులు గడ్డం స్వామి, వెంకటేష్, కొల రాజిరెడ్డి, చంద రాజేశం పాల్గొన్నారు.

ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం

సిరిసిల్ల టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ.80వేల కోట్లు కేటాయించి ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వేణు మాట్లాడారు. జిల్లాలో 2లక్షల మంది ఉపాధికార్మికులు ఉన్నప్పటికి 64వేల మందికి మాత్రమే ఉపాధి పనులు దొరుకుతున్నాయని, వీరికి మాత్రమే జాబ్ కార్డులున్నాయన్నారు. పనిచేస్తున్న కార్మికులకు కూడా పెండింగ్ బాకాయిలు రావడం లేదని ఆరోపించారు. బీజేపీ పుణ్యమా అని కార్మికులకు వేసవి భత్యాలు పూర్తి తగ్గించిందని, పనిముట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కార్మికులకు కనీసం రోజుకు రూ.700 గిట్టుబాటు అయ్యేలాగా పని చూపించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పని చేయడానికి దరఖాస్తులు చేసుకున్నా జాబ్‌కార్డులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు మీసం లక్ష్మన్, అజ్జ వేణు, సోమ నాగరాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేములవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల 2011-14 సంవత్సరాలకు చెందిన డిగ్రీ విద్యార్థుల పూర్వవిద్యార్థుల సమ్మేళనం బుధవారం స్థానిక నందీశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆటపాటలతో సందడి చేశారు. చదువు చెప్పిన గురువులను సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల కరస్పాండెంట్ అయాచితుల జితేందర్‌రావు మాటాడారు. కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్లు ఓరగంటి విష్ణు, ఆరేపల్లి శ్రీనివాస్, ముదాం రాజు, అధ్యాపకులు పద్మ, శారద, సీతారాములు, మధు, గంగరాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితులపై అక్రమ కేసులు సరికాదు

- బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గూగులోతు సురేష్‌నాయక్

సిరిసిల్ల టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : బాధితులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గూగులోతు సురేష్‌నాయక్ అన్నారు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్తాబాద్ సేవాలాల్ తండాలోని కొందరిపైన కొంతమంది వ్యక్తులు దాడి చేసి, కులం పేరుతో దూషించారన్నారు. ఈ విషయమై ఎస్సైకి ఫిర్యాదు చేయగా, బాధితులనే రిమాండ్‌కు పంపించారని ఆరోపించారు. దొంగతనం చేశారని తండావాసులపై అక్రమ కేసులు పెట్టడం బాధాకారమన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు బాధ్యులైన డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా, న్యాయం చేస్తామని డీఎస్పీ హామీనిచ్చారన్నారు. అకారణంగా ఎస్సీ ఎస్టీ కేసుపైన ఎస్ఐ జాప్యం చేయడం సరికాదన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బంజారా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య బిక్షపతినాయక్, జిల్లా విజిలెన్స్ ఎస్సీ, ఎస్టీ సభ్యుడు అజ్మీరా తిరుపతినాయక్, తాజా మాజీ సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్, సంఘం జిల్లా నాయకులు అజ్మీరా రాజునాయక్, లకావత్ నర్సింలునాయక్, భూక్యా ప్రభునాయక్, భూక్య సీత్యానాయక్, మూడవత్ నవీన్‌నాయక్, ధరంతోట రవినాయక్, మూడవత్ నర్సింలు, భూక్య దేవలాల్ నాయక్, తేజావత్ అనిల్ నాయక్, బాధిత మహిళలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

తంగళ్లపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల గురించి అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా తంగళ్ళపల్లి మండలంలోని పలువురు సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్‌చేశారు. తెల్లవారుజామున మాజీ సర్పంచుల రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షులు మాట్ల మధు, రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ ప్రధానకార్యదర్శి గనప శివజ్యోతిలతో పాటు పలువురు మాజీ సర్పంచులను ముందస్తు అరెస్ట్ చేసి తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం కొళ్ళమద్ది మాజీ సర్పంచ్ కేశవరావును బుధవారం తెల్లవారు జామున పోలీస్‌లు అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరళించారు. మాజీ సర్పంచ్‌ల ఫోరం జేఏసీ మెంబరు అయిన కేశవరావును ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

● చందుర్తి : చందుర్తి పోలీసులు బుధవారం తెల్లవారుజామున మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రెండుగంటలపాటు అదుపులో ఉంచుకొని వదిలిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో తాజా మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, చందుర్తి మాజీ సర్పంచ్ సిరికొండ ప్రేమలత శ్రీనివాస్, వీఆర్ఏల వారసులు పురుషోత్తం, శ్రీనివాస్‌లు ఉన్నారు.

వరుసగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు..

- మల్లారెడ్డిపేట యువకుడి ప్రతిభ



మెతుకు సంతోష్

గంభీరావుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) మొక్కవోని దీక్షతో చదివి నాలుగు సర్కారీ కొలువులు సాధించాడు ఆ యువకుడు. తాజాగా గ్రూపు 2 పరీక్ష ఫలితాల్లో 235 ర్యాంక్ సాధించి పలువురి ప్రశంసలందుకున్నాడు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మెతుకు సంతోష్‌ది సాధారణ వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులైన కళావతి, రాములు వ్యవసాయ పనులు చేస్తూ సంతోష్‌ను చదివించారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తిచేసిన సంతోష్ సర్కారు కొలువులపై దృష్టి పెట్టి పట్టుదలతో చదివాడు. ప్రభుత్వ ఉద్యోగ వేటలో నిమగ్నమై, అనుకున్న లక్ష్యాన్ని సాధించాడు. మొదట సింగరేణి సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా, తరువాత ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా, తరువాత గ్రూపు 4లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి రిజైన్ చేసి, సిరిసిల్లలోని ట్రెజరీ డిపార్ట్‌మెంటులో జూనియర్ అసిస్టెంటుగా చేరి, విధులు నిర్వహిస్తువచ్చాడు. తాజాగా మంగళవారం విడుదలైన గ్రూపు2 ఉద్యోగ నియామకాల్లో రాష్ట్రస్థాయిలో 235ర్యాంక్ సాధించాడు. చిన్నవయస్సులోనే ఏకంగా నాలుగు ఉద్యోగాలు సాధించినందుకు గ్రామంలో అందరు అభినందిస్తున్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్ చిత్రాలతో కూడిన పరీక్ష ప్యాడ్ల పంపిణీపై మండల విద్యాధికారి కృష్ణహరికి ఫిర్యాదు చేశామని బీజేపీ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతో బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయంపై ఎంఈవో కృష్ణహరి స్పందిస్తూ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కేసీఆర్, కేటీఆర్ చిత్రాలతో పరీక్షా ప్యాడ్‌లను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేస్తున్నారని తమ దృష్టికి రాలేదన్నారు. వారి చిత్రాలతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లోకి వెళితే అనుమతించబోమని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు గ్రూప్స్ ఫలితాలను నిలిపివేయాలి..



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రుద్రంగి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు అయ్యేంతవరకు అన్ని రకాల గ్రూప్స్, ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలంటూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ డిమాండ్ చేశారు. రుద్రంగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తర్రే లింగం, సింగారపు బాబు దయ్యాల రమేష్ మురళి వడ్లూరి పరిచయ, దయ్యాల పెద్దలు మల్లయ్య కట్కూరి కట్కూరి దాసు, దాసరి గంగరాజం, ఒద్యారపు రమేష్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.